




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శనివారం,
ఏప్రిల్ 18, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# వీగిన మహిళా బిల్లు



## మహిళల హక్కులకు అడ్డంకులు కలిగిస్తున్నారు: అమిత్‌షా

- మహిళా రిజర్వేషన్లపై విపక్షాల వైఖరిపై ఆగ్రహం
- ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపునూ అడ్డుకుంటున్నారని విమర్శ
- పునర్విభజనతో ఓటర్ల సమానత్వం సాధ్యమని స్పష్టం
- లోక్‌సభలో మూడు బిల్లులపై సమాధానాలు
- పారదర్శకంగా ప్రక్రియ జరుగుతుందని హామీ
- రాబోయే ఎన్నికల్లో మహిళలే తీర్పు చెబుతారని వ్యాఖ్య



## దక్షిణాది ప్రాతినిధ్యానికి కోత దేశద్రోహమే:రాహుల్

- పునర్విభజనతో ఎన్నికల రూపురేఖలు మారతాయని హెచ్చరిక
- అధికార దాహంతో రాష్ట్రాల హక్కులు తుంచుతున్నారని విమర్శ
- ఓబీసీలు, దళితుల రిజర్వేషన్లకు గండి కొట్టడమే లక్ష్యమని ఆరోపణ
- ఇది దేశ సమైఖ్యతను దెబ్బతీసే ప్రయత్నమని వ్యాఖ్య



## లోక్‌సభలో మోదీ సర్కారుకు భారీ ఎదురుదెబ్బ

- మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక బిల్లు తిరస్కరణ
- అవసరమైన 352 ఓట్లకు బదులు 298కే పరిమితమైన మద్దతు
- 230 మంది విపక్ష సభ్యుల వ్యతిరేక ఓటు కీలకం
- రాజ్యాంగ సవరణతో పాటు డీలిమిటేషన్ బిల్లు ఉపసంహరణ
- మోదీ హయాంలో మొదటిసారి ఓ బిల్లు విఫలం
- మహిళా కోటా పేరుతో రాజకీయ పోరు ముదిరింది


న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా భావించిన మహిళా రిజర్వేషన్ల రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో విఫలమవడం సంచలనంగా మారింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను 2029 నుంచే అమలు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ ప్రతిష్టాత్మక బిల్లు మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేకపోయింది. శుక్రవారం జరిగిన ఓటింగ్‌లో బిల్లుకు అవసరమైన 352 ఓట్లు రాకపోవడంతో స్పీకర్ ఓం బిర్లా బిల్లు వీగిపోయినట్టు ప్రకటించారు. మొత్తం 540 మంది సభ్యుల్లో 528 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, 298 మంది మాత్రమే అనుకూలంగా ఓటేశారు. 230 మంది విపక్ష సభ్యులు వ్యతిరేకంగా ఓటేయడంతో బిల్లుకు కావాల్సిన మెజారిటీ అందలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ బిల్లును ఉపసంహరించుకుంది. రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్న డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సవరణ బిల్లులను కూడా వెనక్కు తీసుకుంటున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. మోదీ ప్రభుత్వ కాలంలో లోక్‌సభలో ఒక బిల్లు ఇలా ఓటింగ్‌లో వీగిపోవడం ఇదే తొలిసారి కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ప్రత్యేకంగా పార్లమెంట్‌ను సమావేశపరచి మూడు కీలక బిల్లులు తీసుకురావడం, వాటిపై 18 గంటలకు పైగా చర్చ జరగడం జరిగినప్పటికీ చివరికి బిల్లు ఆమోదం పొందకపోవడం కేంద్రానికి గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ఈ బిల్లులో భాగంగా లోక్‌సభ స్థానాలను 543 నుంచి 816కు పెంచి, అందులో 33 శాతం మహిళలకు కేటాయించాలనే ప్రతిపాదన ఉంది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని పునర్విభజన చేపట్టాలని ప్రభుత్వం యోచించింది. అయితే ఈ ప్రతిపాదనలపై విపక్షాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయ ప్రయోజనాల కోసం డీలిమిటేషన్‌ను ముందుకు తెస్తున్నారని ఆరోపించాయి. బిల్లు విఫలమైన తర్వాత అధికార, విపక్షాల మధ్య విమర్శల యుద్ధం మరింత ముదిరింది. మహిళల హక్కులను అడ్డుకున్నవారిగా కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలను కేంద్ర మంత్రులు తప్పుపట్టారు. దేశ మహిళలు ఈ నిర్ణయాన్ని ఎప్పటికీ మర్చిపోరని, భవిష్యత్ ఎన్నికల్లో దీని ప్రభావం తప్పదని

(మిగతా 2వ పేజీలో)



# పెండింగ్ బకాయిలను విడుదల చేయండి

- 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యం సేకరించండి
- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి..
- యాసంగి పంటకు అనుకూలంగా బాయిల్డ్ బియ్యం ఉత్పత్తి
- పోషకాహార బియ్యం పంపిణీ పునఃప్రారంభానికి వినతి
- కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడి



న్యూఢిల్లీ: యాసంగి పంటకు సంబంధించి తెలంగాణ నుంచి 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యాన్ని సేకరించాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి కేంద్ర ఆహార శాఖ మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వరి ధాన్యం బాయిల్డ్ బియ్యం తయారీకి అనుకూలమని వివరించారు. గత సీజన్ల గణాంకాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ బియ్యానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ నుంచి సరఫరాను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో సుమారు తొంభై లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. అందులో భాగంగా ముప్పై లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యాన్ని ఐదు శాతం నూకతో, అదనంగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యాన్ని పది శాతం నూకతో సరఫరా చేయగలమని తెలిపారు. ఈ ప్రతిపాదనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర మంత్రి

(మిగతా 2వ పేజీలో)



కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు
- కల్నల్ పరీక్షిత్ మెహ్రా ఆధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీ
- మే 30లోగా పరిశీలనలు పూర్తి చేయాలన్న ప్రభుత్వం

## మహిళా బిల్లు వీగిపోవడానికి పూర్తి బాధ్యత బీజేపీదే: కేటీఆర్

- డీలిమిటేషన్ అంశాన్ని ముడి పెట్టడంతోనే వీగిపోయిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ సహా అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్లకు సానుకూలమేనని వెల్లడి
- బీజేపీ రాజకీయంతోనే బిల్లు వీగిపోయిందని విమర్శ
- ఇప్పటికైనా డీలిమిటేషన్‌తో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు తేవాలని సూచన



## దేశం పెద్ద ప్రమాదం నుండి బయటపడింది: రేవంత్

- భారత చరిత్రలో ఇది చిరస్మరణీయ ఘట్టం
- సవరణ బిల్లును అడ్డుకున్న విపక్ష ఐక్యతకు కృతజ్ఞతలు
- ప్రజాస్వామ్య రక్షణలో అన్ని పార్టీల పాత్ర కీలకం
- దక్షిణాది హక్కుల పోరాటానికి జాతీయ మద్దతు: సీఎం



హైదరాబాద్: లోక్‌సభలో రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకోవడం ద్వారా దేశం ఒక పెద్ద ప్రమాదం నుంచి బయటపడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుల ఐక్యతతో జాతీయ విపత్తు నివారించబడిందని, ఈ రోజు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా పార్లమెంటులో ఏకమై పోరాడిన అన్ని పార్టీల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాజకీయ పార్టీల నేతలు ఒకే వేదికపై నిలబడి బిల్లును వ్యతిరేకించడం ప్రజాస్వామ్య బలం అని ఆయన అభివర్ణించారు. ప్రాంతీయ, జాతీయ నాయకులు కలసి నిలిచిన ఈ పోరాటం దేశ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడటంలో ఈ ఐక్యత ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలపై ప్రారంభం నుంచే

(మిగతా 2వ పేజీలో)

# ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను టి ఆర్ పి పార్టీ ఖండన.!


## - తేజస్వి సూర్య ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలి - సికీలమెట్ల సతీష్ నాయి

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తక్కువ చేసి మాట్లాడిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగినవే కాకుండా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై నేరుగా దాడి చేయడమేనని,బీజేపీ దురహంకార ప్రాంతీయ విబేధ రాజకీయాలను తిప్పికొట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ మునుగోడు నియోజకవర్గం ఇన్చార్జి సికీలమెట్ల సతీష్ నాయి ఖండించారు. తెలంగాణ రాష్ట్రం అనేది పాలక వర్గాల దయాదాక్షిణ్యంతో వచ్చినది కాదని,ఇది విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు చేసిన దీర్ఘకాలిక పోరాటాల ఫలితమన్నారు.వేలాది మంది యువత తమ ప్రాణాలను అర్పించిన ఉద్యమాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదన్నారు. బీజేపీ నాయకత్వం ఎప్పటిలాగే ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టి, ప్రజలను మతం-ప్రాంతం పేరిట విభజించి రాజకీయ లాభాలు పొందాలని చూస్తోందని విమర్శించారు, తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు బీజేపీ పార్టీ అసలు స్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నాయన్నారు. ఇది కేవలం వ్యక్తిగత అభిప్రాయం కాదని,ఇది బీజేపీ దురహంకార రాజకీయాల ప్రతిబింబమన్నారు. తెలంగాణను అవమానించే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు తిరస్కరిస్తారన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఈ విధమైన వ్యాఖ్యలను దేశ ప్రజలు క్షమించరన్నారు. బీజేపీ ఎంపీ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ విభజన గురించి పార్లమెంట్ లో మాట్లాడుతుంటే తెలంగాణ నుండి ప్రాతినిధ్యం ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు నిద్రమత్తులో ఉన్నారా అని వారు ప్రశ్నించారు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఈ అంశంపై



స్పష్టమైన వివరణ ఇవ్వాలని, ఇటువంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేసిన సూర్యను ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు



## చౌటుప్పల్ హైవేపై యథేచ్ఛగా మట్టి మాఫియా!

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 17

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు లేకుండానే నల్లమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం ఈ విషయమై బోయ లింగస్వామి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.?వలిగొండ మండలం గోకారం గ్రామంలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే కొందరు వ్యక్తులు మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. ఈ నల్లమట్టిని టిప్పర్ల ద్వారా చౌటుప్పల్ హైవే మీదుగా రాత్రింబవళ్లు తేడా లేకుండా తరలిస్తున్నారు. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే తమకు అన్ని అనుమతులు ఉన్నాయని బుకాయిస్తున్నట్లు సమాచారం. అయితే, రాత్రి వేళల్లో తవ్వకాలకు అనుమతులు ఎలా ఇస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు.?నిమ్మకు నీరెత్తినట్లు అధికారులుఈ అక్రమ రవాణాపై స్థానిక రెవెన్యూ (ఎమ్మార్వో ), పోలీస్ (సీఐ ) అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఫిర్యాదుదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల కళ్లముందే టిప్పర్లు తిరుగుతున్నా కనీసం తనిఖీలు కూడా చేయడం లేదని, వారి పరోక్ష సహకారంతోనే ఈ తవ్వకాలు జరుగుతున్నాయని విమర్శించారు.?చౌటుప్పల్ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై స్పందించి, అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అధికారులు స్పందించి అక్రమ రవాణాను అడ్డుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్థానికులు హెచ్చరిస్తున్నారు..

# అమావాస్యను పురస్కరించుకొని కృష్ణ గోపాల్ సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ

## -11 సంవత్సరాలుగా మా సంస్థకు సేవలందిస్తున్న మా సభ్యులందరికీ రుణపడి ఉంటా -- కపిల్ కుమార్ అగర్వాల్





వనస్థలిపురం వార్త మిర్రర్ ప్రతినిధి

వనస్థలిపురంలో అమావాస్య సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది ప్రజలు భోజనంతో పాటు వేసవి ప్రత్యేక మజ్జిగను ఆస్వాదించారు. అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ"గత 11 సంవత్సరాలుగా మా సభ్యులందరూ తమ సంస్థలో నిరంతరం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ పేద, నిరుపేద వృద్ధులకు, అనాథ పాఠశాల విద్యార్థులకు, దేవాలయంలోకి వచ్చే భక్తులకు నిరంతరం అన్నప్రసాద సేవలు చేస్తూ నాతో నడిచిన మా సభ్యులకు హృదయపూర్వక ధన్యవాదాలు అని అన్నారు ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి సచిన్ అగర్వాల్, కోశాధికారి కుష్ అగర్వాల్, సంయుక్త కార్యదర్శి మనోజ్ గుప్తా, ఈసీ సభ్యులు పాకా సతీష్ యాదవ్, సునీల్ దరాడే, ధవలే ఆకాష్, దినేష్ కాళి పాల్గొని అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల హర్షం .. మహిళా నాయకురాలు దోనేపూడి రమాదేవి..



మియాపూర్ వార్త మిర్రర్ : చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం మంచి పరిణామము అని మియాపూర్ డివిజన్ కి చెందిన ప్రసాద్స్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధురాలు దోనేపూడి రమాదేవి తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి అన్న స్వర్గీయ నందమూరి తారక రామారావు మహిళలకు ఆస్తి లో సమాన హక్కులు కల్పించి, మహిళలు గౌరవంగా జీవించేలా చేసిన ఘనత ఆయనకే దక్కిందని అన్నారు, అలాగే ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి మహిళాభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారని, మహాలక్ష్మి స్కీమ్,ఆరోగ్య లక్ష్మి స్కీమ్,ఉమెన్ ఎంటర్ప్రెన్యూర్ షిప్, మహాలక్ష్మి ఫైనాన్సియల్ అసిస్టెన్స్, ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన,షీ టీమ్స్, బాలామృతం, మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్, చీఫ్ మినిస్టర్ చైల్డ్ ప్రొటెక్షన్ స్కీమ్, ఉమెన్ ఎంటర్ప్రెన్యూర్ సపోర్ట్ స్కీమ్, లాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని ఆమె తెలిపారు. అలాగే చట్ట సభల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించడం వలన మరింత అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని దోనేపూడి రమాదేవి తెలిపారు. రాబోయే మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని ఆమె తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి భారత పార్లమెంట్ వరకు అన్ని పార్టీలలో అలాగే అన్ని రంగాలలో మహిళల ప్రతిభ మనం చూస్తున్నామని ఆమె అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు అన్ని పార్టీల మద్దతు తప్పక ఉంటుందని ఆమె అన్నారు. పహల్గామ్ తీవ్ర దాడులకు వ్యతిరేకంగా ఆపరేషన్ సింధూర్ లో ఇండియన్ ఆర్మీ కలనల్ సోఫియా ఖ్యరేషి, ఇండియన్ ఎయిర్ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమిక సింగ్ లాంటి మహిళా ఆఫీసర్స్ పోరాట పటిమ, ధైర్య సాహసాలు చూసేము. అవకాశం వస్తే మహిళలు కూడా బ్రహ్మాండం గా వారి వారి రంగాలలో రాణిస్తారు అని దోనేపూడి రమాదేవి తెలిపారు. దేశం లోని అన్ని రాజకీయ పార్టీలు మహిళా బిల్లు కి మద్దతు తెలపాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# అరైవ్ అలైవ్ క్యాంపెయిన్"లో గోల్డెన్ అవర్ ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 17:

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడటంలో కీలకమైన "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యతపై ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "అరైవ్ అలైవ్ క్యాంపెయిన్"లో భాగంగా తార్నాకలోని ఆర్టీసీ హాస్పిటల్‌లో విద్యార్థులు, సిబ్బందికి ఈ కార్యక్రమం జరిగింది.బేగంపేట టిటిఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్, ఉస్మానియా యూనివర్సిటీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సత్యనారాయణ సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ శ్రీ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏసీపీ లక్ష్మణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే మొదటి 60 నిమిషాలు "గోల్డెన్ అవర్"గా పరిగణించబడతాయని తెలిపారు. ఈ సమయంలో తక్షణ వైద్య చికిత్స అందిస్తే మరణాలను నివారించడమే కాకుండా శాశ్వత వైకల్యాలను కూడా తగ్గించవచ్చని వివరించారు. డ్రైవింగ్ సమయంలో అప్రమత్తత అత్యవసరమని, నిర్లక్ష్య డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించవచ్చని సూచించారు.అనంతరం ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయే వంటి అత్యవసర పరిస్థితుల్లో "గోల్డెన్ 10 నిమిషాలు" అత్యంత కీలకమని, ఈ సమయంలో సి పి ఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. గోల్డెన్ అవర్‌లో ప్రథమ చికిత్స అందించడం ద్వారా బాధితుల ప్రాణాలను రక్షించవచ్చని వివరించారు.అలాగే, రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'రాహ్-వీర్' (గుడ్ సమారిటన్) పథకం కింద రూ.25,000 నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీట్‌బెల్ట్, హెల్మెట్ వినియోగం, వేగ పరిమితులు పాటించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వాడకాన్ని నివారించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలని, సురక్షిత దూరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, సుమారు 300 మంది విద్యార్థులు, టిటిఐ సిబ్బంది సాయికుమార్, కృష్ణ పాల్గొన్నారు.

## ఆఫీసర్స్ కాలనీలో రియల్ ఎస్టేట్ మోసం - ముగ్గురు అరెస్ట్



కీసర, వార్త మిర్రర్, ఏప్రిల్ 17 : కీసర పోలీస్ స్టేషన్ పరిధి రాంపల్లి లోని దయానంద నగర్ ఆఫీసర్స్ కాలనీలో ఉన్న ఓ ప్లాట్ విషయంలో రియల్ ఎస్టేట్ మోసం కేసును కీసర పోలీసులు చేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టు లో హాజరుపరిచారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, ప్లాట్ నెం.235 (సర్వే నంబర్లు 263/పార్ట్ అండ్ 264, విస్తీర్ణం 200 చదరపు గజాలు) అసలు యజమాని గంగాధర వీరయ్య కాగా, ఆయన తన కూతురు లీలావతికి గిఫ్ట్ డీడ్ ఇచ్చారు. అనంతరం లీలావతి 2022 మార్చి 29న గంగి మల్లేష్‌కు ఆ స్థలాన్ని విక్రయించగా ఆయన కాంపౌండ్ వాల్ సైతం నిర్మించారు. ఈ స్థలంపై బెదిరింపు కాల్స్ రావడంతో గంగి మల్లేష్ కీసర పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు నాంపల్లి ప్రభాకర్ రెడ్డి (ఎ1) అసలు డాక్యుమెంట్లు దొరకడంతో తన సహచరులు గుడిబాటి రమేష్ రెడ్డి (ఎ3), తుమ్మల మధుకర్ రెడ్డి (ఎ4)లతో కలిసి కుట్ర పన్ని, అసలు యజమాని స్థానంలో మరో వ్యక్తి నచ్చు రామస్వామి (ఎ2)ను చూపిస్తూ 2004లో నకిలీ రిజిస్ట్రేషన్ చేయించారు. ఆ నకిలీ పత్రాల ఆధారంగా పలువురికి భూమిని విక్రయిస్తూ భారీగా డబ్బులు సంపాదించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో ఎ1 నాంపల్లి ప్రభాకర్ రెడ్డి, ఎ3 గుడిబాటి రమేష్ రెడ్డి, ఎ4 తుమ్మల మధుకర్ రెడ్డి లను శుక్రవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. మిగతా నిందితులు పరారీలో ఉండగా వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. భూములు కొనుగోలు చేసే ముందు అసలు పత్రాలను పూర్తిగా పరిశీలించాలని, పాత రిజిస్ట్రేషన్లు, యజమాని వివరాలను ధృవీకరించాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద లావాదేవీలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.ఈ మేరకు కీసర పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు తెలిపారు.

# ఎన్ హెచ్ఏఐ డైరెక్టర్‌కు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల వినతి

## - మురుగునీటి సమస్య పరిష్కారానికి డ్రైనేజీ విస్తరణ చేపట్టాలి





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిది ఏప్రిల్17

జాతీయ రహదారి (ఎన్ హెచ్ 65)పై ప్రస్తుతం ప్రతిపాదించిన మట్టి కట్ట నిర్మాణాన్ని రద్దు చేసి, దానికి బదులుగా పిల్లర్లపై ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని జాతీయ రహదారుల అథారిటీ (ఎన్ హెచ్ ఏ ఐ ) ప్రాంతీయ కార్యాలయంలో డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. మట్టి కట్ట వల్ల స్థానికంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, వ్యాపార సముదాయాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక పద్ధతిలో పిల్లర్లతో కూడిన ఫ్లైఓవర్ నిర్మిస్తేనే ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు.రోడ్డు నిర్మాణంతో పాటు ఎన్హెచ్ 65 పక్కన ఉన్న డ్రైనేజీ విస్తీర్ణాన్ని పెంచాలని ఆయన అధికారులకు సూచించారు.?ఎమ్మార్వో ఆఫీస్ నుంచి ప్రారంభమై19, 12, 13వ వార్డుల మీదుగా వెళ్లే డ్రైనేజీ సమస్యపై అధి,కారులతో ప్రత్యక్షంగా చర్చించారు.?వర్షాకాలంలో నిలిచిపోయే నీటి వల్ల స్థానికులు పడుతున్న ఇబ్బందులను వివరించి, డ్రైనేజీ పైపుల సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు,

ఉదరి యాదయ్య, కోయడ శేఖర్ గౌడ్, మాజీ సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఉడుగు మల్లేశం గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్, గుండబోయిన వెంకటస్వామి, చెవగోని మహేష్, బిఆర్ఎస్ పార్టీ తోర్పునూరు మల్లేష్ గౌడ్, మున్న,ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ప్రజల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన డైరెక్టర్, క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు..

# మే 1న కాప్రా చెరువు సుందరీకరణ పనులు

### కాప్రా చెరువు అభివృద్ధికి రూ.35 కోట్లు



చెరువులో సుందరీకరణ పనులకు శ్రీకారం కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 17 : ఉప్పల్ నియోజకవర్గంలోని పలు చెరువుల సుందరీకరణకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సుమారు 100 కోట్ల రూపాయలను మంజూరు చేసిన విషయం విధితమే. కాప్రా చెరువు సుందరీకరణ గాను 36 కోట్ల రూపాయల వ్యయంతో మే 1న పనులు ప్రారంభం కానున్నాయి. సుమారు 112 ఎకరాల్లో కాప్రా చెరువును అత్యంత సుందరీకరణగా తీర్చిదిద్దుతామని హైడ్రా డిజైనర్ యూనస్ తెలిపారు. చెరువు మధ్యలో ఐలాండ్ ను తీర్చిదిద్ది మూడు వైపుల నుంచి ఎంట్రన్స్ ఏర్పాటు చేసి ఫుటోవర్ బ్రిడ్జితో పనులు జరుగుతాయి అన్నారు. పర్యాటకులు సేద తీరేందుకు విరామ స్థలాలు, చిల్డ్రన్స్ ప్లే పార్క్, ఓపెన్ జిమ్, చెరువు చుట్టూ పకడ్బందీగా ప్రహరీ నిర్మాణం ఉంటుందని వివరించారు. కాప్రా చెరువులో రూ.35 కోట్ల లతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్న తరుణంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి శుక్రవారం స్థానిక నాయకులతో చెరువును సందర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గంలోని చెరువులను సుమారు రూ.100 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ నల్ల చెరువు రూ.20 కోట్లతో చేపట్టిన పనులు తుది దశలో ఉన్నాయన్నారు. ఇదే కాకుండా నాచారం హెచ్ఎంటీ నగర్ చెరువు రూ.30కోట్లు, రామంతాపూర్ పెద్ద చెరువు రూ.17కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులను చేపట్టనున్నట్లుగా చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి ,స్వర్ణరాజ్ శివమణి గారు, సింగిరెడ్డి ధన్పల్ రెడ్డి ,పావని రెడ్డి ,మాజీ కౌన్సిలర్ రాజేందర్ , డిసిసి ప్రధాన కార్యదర్శి పాకాల రాజ్ కుమార్, ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్, పెద్ది నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సీతా రామ్ రెడ్డి ,డివిజన్ అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి : ఏఐవైఎఫ్

### ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

### తేజస్వి సూర్య సభ్యత్వంను తొలగించాలి

### ప్రాంతీయ విబేధ రాజకీయాలను తిప్పికొడుదాం

### ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం




కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 17 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తక్కువ చేసి మాట్లాడిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించదగినవే కాకుండా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై నేరుగా దాడి చేయడమేనని,బీజేపీ దురహంకార ప్రాంతీయ విబేధ రాజకీయాలను తిప్పికొట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఖండించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని వై జంక్షన్ కూడలి వద్ద ప్లకార్డులు చేతబూని బీజేపీ ఎంపీ వ్యాఖ్యలను నిరసిస్తూ సూర్య దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అనేది పాలక వర్గాల దయాదాక్షిణ్యంతో వచ్చినది కాదని,ఇది విద్యార్థులు, యువత, కార్మికులు, రైతులు చేసిన దీర్ఘకాలిక పోరాటాల ఫలితమన్నారు.వేలాది మంది యువత తమ ప్రాణాలను అర్పించిన ఉద్యమాన్ని అవమానించే హక్కు ఎవరికీ లేదన్నారు. బీజేపీ నాయకత్వం ఎప్పటిలాగే ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టి, ప్రజలను మతం-ప్రాంతం పేరిట విభజించి రాజకీయ లాభాలు పొందాలని చూస్తోందని విమర్శించారు, తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు బీజేపీ పార్టీ అసలు స్వరూపాన్ని బహిర్గతం చేస్తున్నాయన్నారు. ఇది కేవలం వ్యక్తిగత అభిప్రాయం కాదని,ఇది బీజేపీ దురహంకార రాజకీయాల ప్రతిబింబమన్నారు. తెలంగాణను అవమానించే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలు తిరస్కరిస్తారన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఈ విధమైన వ్యాఖ్యలను దేశ ప్రజలు క్షమించరన్నారు. బీజేపీ ఎంపీ వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ విభజన గురించి పార్లమెంట్ లో మాట్లాడుతుంటే తెలంగాణ నుండి ప్రాతినిధ్యం ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు నిద్రమత్తులో ఉన్నారా అని వారు ప్రశ్నించారు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఈ అంశంపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని, ఇటువంటి బాధ్యతారహిత వ్యాఖ్యలు చేసిన సూర్యను ఎంపీ సభ్యత్వం రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచే బీజేపీ దురహంకార రాజకీయాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ నిరసనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు నేర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్, రాష్ట్ర సమితి సభ్యులు కాంపల్లి కళ్యాణ్, మొహమ్మద్ అక్రమ్, లక్ష్మణ్, నదీమ్, రవి, మురళి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# కాంబోడియా సైబర్ ముఠా గుట్టు రట్టు -- నిందితుడి అరెస్ట్



డిజిటల్ అరెస్ట్ స్కామ్‌తో రూ.24 లక్షల మోసం...


సైబరాబాద్ వార్త మిర్రర్ : సైబరాబాద్ పరిధిలో డిజిటల్ అరెస్ట్ స్కామ్ కేసులో కీలక నిందితుడు గజర్ల అవినాష్ (26), జగిత్యాల జిల్లా కట్లకుంట గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సైబర్ క్రైమ్స్ డీ సీ పీ టీ. సాయి మనోహర్ వివరాల ను వెల్లడించాడు. ఉద్యోగం పేరుతో కాంబోడియాకు వెళ్లిన అతను అక్కడ సైబర్ ముఠా చేత బలవంతంగా మోసపూరిత కాల్స్ చేయించబడి, తర్వాత స్వచ్ఛందంగా మోసాల్లో పాల్గొన్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసుల వేషం వేసుకుని బాధితులకు కాల్ చేసి కేసుల్లో ఇరికిస్తామని బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఈ ముఠా, భారత్‌లో మ్యూల్ ఖాతాల ద్వారా సొమ్మును మళ్లించింది. జనవరి-ఫిబ్రవరి 2026లో సుమారు రూ.24 లక్షలు అక్రమంగా లావాదేవీలు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడి వద్ద నుండి మొబైల్ ఫోన్, పాస్‌పోర్ట్‌తో పాటు రూ.12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు తన పాత్రను అంగీకరించగా, ఇతర సహచరులను గుర్తించేందుకు, డబ్బు మార్గాన్ని ట్రేస్ చేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. ప్రజలు అనుమానాస్పద కాల్స్, లింకులు, స్క్రీన్ షేరింగ్ యాప్స్, కెవైసి లేదా బ్యాంక్ పేరుతో వచ్చే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.




# అమృత్ జల పథకం బాధితుడు మానవ హక్కుల కమిషన్ లో ఫిర్యాదు

### న్యాయం చేయాలని వేడుకోలు

### అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం కు చెందిన అమృత్ జల్ పథకం భూ బాధితుడు కుర్మా మల్లారెడ్డి మానవ హక్కుల కమిషన్ శుక్రవారం ఆశ్రయించగా ఐస్ ఆర్ నెంబర్ అనుసరించి 1567/2026 కమిషన్ లో నమోదయింది. ఇట్టి సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టా భూముల పంట పొలాల మధ్య రైతులకు దాదాపు (80) మంది వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు నష్టం వాటిల్లే విధంగా కాంట్రాక్టులకు కక్కుర్తి పడి, అనవసరంగా (అవసరం లేనిచోట) వాటర్ ట్యాంకు నిర్మాణశీ పేరుతో మా యొక్క భూములను అన్యాయంగా లాక్కొనే ప్రక్రియను అధికార యంత్రం నిలిపివేసి, వేరొక చోట నిర్మాణం చేయాలని విజ్ఞప్తి చేసినప్పటికిని స్పందించక పోవడంతో మానవ హక్కుల కమిషన్ ఆశ్రయించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ ఆధారిత రైతులశీ అయిన. మేము కుర్మ మల్లారెడ్డి, కుర్మ నారాయణ రెడ్డి, కుర్మ ప్రేమ్ కుమార్ రాయికల్ పట్టణంలో నివసిస్తున్నాము. మాకు సర్వేనెంబర్ 988/2/1/1/1, 988/2/1/2/1, 988/2/1/3/1 యందు వ్యవసాయ పట్టా భూములను కలిగియున్నాము. ఇట్టి భూములలో మేము వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాము. మాకు ఇట్టి భూమే వ్యవసాయమే జీవనాధారము. కానీ, ఇట్టి సర్వేనెంబర్ల యందు రెవెన్యూ మరియు మున్సిపల్ శాఖల వారు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, మా అనుమతి లేకుండా, బలవంతంగా మా భూమిని లాక్కోవాలనే దురుద్దేశ్యంతో భూములను వాటర్ ట్యాంకు నిర్మాణం కొరకు భూసేకరణ చేస్తున్నట్లుగా పై అధికారులకు నివేదికను పంపారు అని, మా అనుమతి లేకుండానే మా భూములను ల్యాండ్ అండ్ సర్వే విభాగం వారిచే తప్పుడు సర్వే నిర్వహించి కాంట్రాక్టులకు కక్కుర్తి పడి, ఇట్టి వాటర్ ట్యాంకు నిర్మాణం చేయుటకు బలవంతంగా మమ్ములను బెదిరిస్తూ యంత్రాలతో ఇట్టి భూములలో నిర్మాణ పనులకు నాలుగు శాఖల అధికారులు కదిలి వచ్చి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, అధికారులు మా కుటుంబాలను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయికల్ లో ఇప్పటికే మిషన్ కాకతీయ క్రింద ఆరు వాటార్ ట్యాంకుల నిర్మాణం చేసినారు. ఇందులో ఒక మెగా వాటర్ ట్యాంక్ ఉందని ఇది ఒక్కటే రాయికల్ మండలం మొత్తాన్ని త్రాగునీరు సరఫరా చేయగల సామర్థ్యం కలదనీ అయినప్పటికిని కమీషన్లకు కక్కుర్తి పడి, మా పంట వట్టాభూముల్లో అక్రమంగా ఆక్రమించి వాటర్ ట్యాంకు నిర్మాణం చేయాలని సంకల్పించినారు. ఒకవేళ వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగితే మాతో పాటు మా చుట్టు ప్రక్కల ఉన్నటువంటి రైతుల భూముల నుండి పైపు లైన్ల ను ఏర్పాటు చేయవల్సి వస్తుంది అని దాంతో వారు కూడా తీవ్రంగా నష్ట పోతారు మేము గతంలో ప్రభుత్వ ఐ.కె.పి. -స్త్రీశక్తి భవన్ ఉచితంగా దాదాపు 06 గుంటల భూమిని దానంగా ఇవ్వడం జరిగింది. ఇప్పుడు బలవంతంగా మా యొక్క అనుమతి లేకుండ భూములు కబ్జా చేయుటకు అధికారులు చూడడంతో మా మూడు కుటుంబాలు రోడ్డున పడి అడుక్కునే పరిస్థితికి వస్తాయని అధికారులు బలవంతంగా గుంజుకుంటే మాకు ఆత్మహత్యే శరణ్యం. కన్నీటి పర్యంతమయ్యారు. వాస్తవముగా ఇట్టి వాటర్ ట్యాంక్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ భూములలో నిర్మించుటకు అవకాశము ఉంది అని అయిన అధికారులు ఉద్యేశ్యాపూర్వకంగా మా పంట భూములను నాశనం చేయాలని అధికారులు సంకల్పించడం శోచనీయం అని అన్నారు. మా యొక్క వంట పట్టా భూముల యందు ఏర్పాటు చేయ చేయతలపెట్టిన వాటర్ ట్యాంకు నిర్మాణము నిలిపివేసి, మా భూమిపై అధికారులు చేసిన తీర్మానాలు రద్దు చేయాలని మా భూములు మాకు ఇప్పించాలని కోరినట్లు తెలిపారు.



## ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కు సన్మానం భగవద్గీత ప్రదానం...

### భావి జీవితం జాతీయ భావం, ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి...

### ఆర్.యు.పి.పి.టి. ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లక్ష్మీపూర్ స్కూల్ అసిస్టెంట్ హిందీ మద్దెల సరోజన గంగారాం ఉద్యోగ విరమణ సందర్బంగా రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ పక్షాన జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ఘనంగా శాలువా తో సత్కరించి భగవద్గీత ప్రదానం చేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో సరోజన మేడమ్ ఎంతో మంది జాతీయభావాలు కలిగిన ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దారని, ఎనలేని సేవలు చేసారని, భావి జీవితం జాతీయత, ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని, జాతీయతే దేశానికి శ్రీరామ రక్ష అని, భారతీయ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచానికి అదర్శవంతమైనవని, ధర్మో రక్షతి రక్షితః అన్న అచరణాత్మకత కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమం మద్దెల ప్రభాకర్, సుజాత, కస్తూరి శ్రీధర్, సత్యనారాయణ, శరత్ చంద్ర, కవిత, పద్మరాణి, సుచరిత, సింగని హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## చైత్ర మాసం అమావాస్య సందర్భంగా ప్రత్యేక కుంకుమ పూజలు.

### - అమ్మ వారికి ముడుపు సమర్పణ

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 17జగిత్యాల పట్టణ చింతకుంట లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయం లో శ్రీ ధనలక్ష్మి సేవా సమితి అధ్వర్యంలో తేదీ: 17.04.2026, చైత్ర మాసం, శుక్ల పక్షం, శుక్రవారం అమావాస్యలి పర్వదినం పురస్కరించుకొని, మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు. పారాయణం అనంతరం మాతలు అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వార ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం మరియు అమ్మ వారి ప్రసాదం తాంబూలం ఆలయ పూజారి ఆశీర్వచనములతో బహుకరించడం జరిగినది. తదనంతరం లిఅమ్మ వారికి ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, గాల్లిపెల్లి సుజాత, మాధురి, హర్షిణి, భారతి, స్వప్న, ఊర్మిళ, మాధవి, గంగవ్వ, అర్చకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో ఆపద్బాంధవుడు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేసిన న్యాయవాది



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17

జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన కళావతి అనే మహిళకు అత్యవసర సమయంలో శాస్త్ర చికిత్స కోసం రక్తం అత్యవసరం కావడంతో స్వచ్ఛందంగా రక్తదానం చేయుటకు ముందుకు వచ్చి న్యాయవాది అల్లే పురుషోత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రి లో రక్తదానం చేశారు. ఇది తొమ్మిదవ సారి రక్తదానం కావడంతో అవసరం వచ్చినప్పుడు రక్తదానం చేసినందుకు ఆయ నను పలువురు అభినందించారు. ఇట్టి సందర్భంగా న్యాయవాది అల్లే పురుషోత్తం మాట్లాడుతు రక్తదానం చేస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని, కొందరు భావిస్తున్నారని ఇది పూర్తిగా ఆవాస్తవం అని రక్తదానం వలన శరీరంలో పాత రక్తం పోయి కొత్త రక్తం రావడంతో గుండెపోటు లాంటి సమస్యల భారీన పడకుంట ఉంటారని మరిన్ని ఆరోగ్య ఉపయోగాలు రక్తదానం వలన ఉన్నాయని రక్తదానం చెయ్యడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తాయనే అపోహాలు నమ్మవద్దని, అందరు అత్యవసర సమయంలో రక్తదానం చేయుటకు సిద్ధంగా ఉండాలని అన్నారు.




## పెండింగు లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై వినతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 17

శుక్రవారం రోజున జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లో తహసీల్దార్ నాగార్జున కు దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఈఈజేఏసి సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా యొక్క డిమాండీలు,1.జూన్ 22002 పి ఆర్ సి క్యూ, 2.పెండింగ్ బిల్లులు 2 విడతలలో చెల్లిం చాలి. 3. సి పి ఎస్ రద్దు చేయాలి. 2003 డిస్సీ వారికి వెంటనే ఓపి ఎస్ అమలు చేయాలి. 4. మే -1 వావ్ హెల్త్ కార్డ్స్ జగ్రీ. 5. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు ఒకే విడతలో చెల్లించాలి. కావున మీరు దయతో పై సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జెఎసి నాయకులు అంతడుపుల గంగారాజం, బొల్లె గంగాధర్, రాపర్తి నర్సయ్య, ఎలిగేటి రాజాకిశోర్, దొంతి సతీష్ ముక్కెర శేఖర్, గాజంగి రాజేశం, బాపు రావు, కడుకుంట్ల అభయ్ రాజ్, రాము, మహేష్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.



# గేమ్‌ఛేంజర్ వచ్చేది అప్పుడే?



రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' విషయంలో కొత్త అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా? అని ఆశగా ఎదురుచూస్తున్న అభిమానులకు ఇది నిజంగా చల్లని వార్తే. వచ్చే ఏడాది సమ్మర్‌లోపు ఈ చిత్రం షూటింగ్‌ను ముగించనున్నట్టు సమాచారం. దాదాపు 90శాతం ఇప్పటికే చిత్రీకరణ పూర్తయింది. ఇదిలావుంటే.. శంకర్ దర్శకత్వంలోనే కమల్‌హాసన్ నటిస్తున్న 'భారతీయుడు 2' కూడా పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. దీన్నిబట్టి ఒక రెండునెలలు అటుఇటుగా రెండు సినిమాలూ విడుదలయ్యే అవకాశం ఉందని సినీవర్గాల సమాచారం. ఇక రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' సినిమా విషయానికొస్తే, సమకాలీన రాజకీయాలను ప్రశ్నిస్తూ, వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ శంకర్ తెరకెక్కిస్తున్న విప్లవాత్మక చిత్రంగా 'గేమ్‌ఛేంజర్'ని చెప్పొచ్చు. ఇందులో రామ్‌చరణ్ తండ్రీకొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కైరా అద్వానీ, అంజలీ కథానాయికలు. ఇంకా శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.


# మహిషాసురుడి కథ కరావళి

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటించిన తాజా చిత్రం 'కరావళి'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో గురుదత్త గనిన తెరకెక్కించారు. త్వరలో విడుదలకానుంది. సోమవారం ఫస్ట్‌లుక్ ప్రోమోను విడుదల చేశారు. ఓ వైపు గేదె ప్రసవం, మరోవైపు హీరో జననం..ఈ రెండింటికి ఏదో సంబంధం ఉన్నట్లు చూపించడం..చివరకు హీరో మహిషాసురుడిగా మారినట్లు చూపించడం ఉత్కంఠను పంచింది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'కరావళి అనే గ్రామంలో జరిగే కథ ఇది. మన భాష, సంస్కృతి మూలాల్లోంచి కథను తీసుకున్నాం. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతాయి. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిమన్యు సదానందన్, సంగీతం: సచిన్ బస్రూర్.

# పద్దెనిమిదేళ్ల విరామం తర్వాత



త్రిష అందంగా ఉంటుంది. తెరపై ఆమె యాటిడ్యూడ్ మళ్లీ మళ్లీ చూడాలనిపించేలా ఉంటుంది. ఆ నవ్వు విప్పారిన పొద్దుతిరుగుడుపువ్వులా ఉంటుంది. మొన్నామధ్య వచ్చిన మణిరత్నం 'పొన్నియన్ సెల్వన్'లో చాలామంది హీరోయిన్లున్నా, అందంలో అందరికంటే ఒకమార్కు ఎక్కువ త్రిషకే పడిందని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అందుకే.. నేటికీ పెద్దపెద్ద సినిమాలు ఈ అందాన్నే వరిస్తున్నాయి. ఇటీవలే తమిళ విజయ్‌కి జోడీగా ఆమె నటించిన 'లియో' సినిమా విడుదలై మంచి వసూళ్లే రాబట్టింది. త్వరలో మరో భారీ సినిమాలో నటించనుంది త్రిష. అది కూడా తెలుగు సినిమా. అందునా మెగాస్టార్ సినిమా. అవును.. చిరంజీవి హీరోగా మల్లిడి వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర'లో త్రిష ప్రధాన కథానాయికగా ఎంపికైంది. అనుష్క, నయనతార, ఐశ్వర్యరాయ్ ఇలా చాలామంది హీరోయిన్ల పేర్లు ఈ పాత్ర విషయంలో వినిపించాయి. చివరకు త్రిష ఖరారైంది. 18ఏళ్ల క్రితం చిరంజీవితో 'స్టాలిన్' సినిమాలో నటించింది త్రిష. మళ్లీ ఇన్నాళ్లకు మెగాస్టార్‌తో జతకట్టనుంది. మెగా అభిమానులకు ఇది నిజంగా శుభవార్తే.



# బాలీవుడ్‌లో సత్తా చూపిస్తా

అగ్ర కథానాయిక కీర్తి సురేష్ ఏ పాత్రలోనైనా చక్కగా ఒదిగిపోతుంది. వాణిజ్య చిత్రాలతో పాటు మహిళా ప్రధాన కథాంశాల్లో కూడా తనదైన నటనతో మెప్పిస్తుంది. ఈ ఏడాది విడుదలైన 'దసరా' చిత్రంలో వెన్నెలగా అద్భుతాభినయంతో మెప్పించింది. తాజాగా ఈ భామ బాలీవుడ్‌లో అరంగేట్రం చేస్తూ నటిస్తున్న వెబ్ సిరీస్ 'అక్క'. పీరియాడిక్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కనున్న ఈ సిరీస్‌ను బాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్నది. ధర్మరాజ్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్‌లో రాధికా ఆప్టేతో కలిసి నటించనుంది కీర్తి సురేష్. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ప్రస్తుతం ఈ సిరీస్ తాలూకు రిహార్సల్స్ ముంబయిలో జరుగుతున్నాయి. సోమవారం ముంబయిలో అడుగుపెట్టిన కీర్తి సురేష్ తన తొలి బాలీవుడ్ వెబ్ సిరీస్ గురించి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. బాలీవుడ్‌లో తన ప్రయాణం ఈ సిరీస్‌తో మొదలుకావడం ఆనందంగా ఉందని, తాను పోషించిన పాత్ర కూడా పూర్తి కొత్తదనంతో ఉంటుందని కీర్తి సురేష్ పేర్కొంది. నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. కీర్తి సురేష్ ప్రస్తుతం తమిళంలో సైరన్, రఘుతాథ, రివాల్వర్ రాణి, కన్నివేడి వంటి చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

# వైమానిక వీరుని కథ

వైమానిక వీరుల పరాక్రమాలను, విధి నిర్వహణలో వారు ఎదుర్కొన్న సవాళ్లను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలైంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిస్తున్న ఈ చిత్రానికి శక్తిప్రతాప్ సింగ్ దర్శకుడు. మానుషి చిల్లార్ కథానాయిక. సందీప్ ముద్దా నిర్మాత. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 16న విడుదల చేయబోతున్నారు. త్వరలో టీజర్ రిలీజ్ కానుంది. దర్శకుడు మాట్లాడుతూ ' ఈ సినిమాలో వరుణ్‌తేజ్ ఎయిర్ పైలట్‌గా కనిపిస్తాడు. రాడార్ ఆఫీసర్ పాత్రలో కథానాయిక మానుషి చిల్లార్ నటిస్తున్నది. ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో వస్తున్న తొలి తెలుగు చిత్రమిది. దేశం ఎదుర్కొన్న అతిపెద్ద వైమానిక దాడుల నేపథ్యంలో యదార్థ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమాను తెరకెక్కించాం. దేశభక్తి ప్రధానంగా ఆకట్టుకుంటుంది. 'మేజర్' వంటి విజయం తర్వాత సోనీ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకాదరణ సొంతం చేసుకుంటుందనే నమ్మకం ఉంది' అని చిత్రబృందం పేర్కొంది.

